ప్రజాశక్తి

గురువారం 31 ఆగష్టు 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





పొత్తులు కుదిరినట్లేనా..?

- తెలుగుదేశం, జనసేన కలిసి పోటీపైనే చర్చ
- జిల్లాలో ఒక స్థానం జనసేనకు కేటాయింపుపై స్పష్టత.!



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికల్లో కేంద్రంతో వ్యవహరించాల్సిన వ్యూహంపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు. బిజెపితో ఎటువంటి విభేదాల్లేవని ప్రకటించారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన నేపథ్యంలో జిల్లాకు రావాల్సిన రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పర్యటనను వాయిదా వేసుకున్నారు. అక్కడ జరిగే పరిణామాలపై దృష్టి సారించాలని సిఎం జగన్ ఆయన్ను ఆదేశించారని సమాచారం. రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ సాగుతోంది. పార్టీల నడుమ రాజకీయంగా వేడెక్కుతోంది.

ఈ తరుణంలో ఎన్నికలకు సమాయత్తం దిశగా పార్టీలు అడుగులు వేస్తున్నాయి. వాడివేడి భేటీలు నడుస్తున్నాయి. ముందస్తు ఎన్నికల ఊహాగానాలు వస్తున్నాయి. రాష్ట్రంలో వైసిపిని దెబ్బకొట్టాలంటే కలిసి పోటీ చేయక తప్పదనే సంకేతాలు ప్రతిపక్షాల్లో కనిపిస్తున్నాయి. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ కేంద్రంలో బిజెపితో రాజీ పడింది. ఈ పాటికే బిజెపితో చెలిమి చేస్తున్న జనసేనతో ఇక్కడ కలిసి పోటీ చేయాలని తెలుగుదేశం గట్టిగా ఉంది. రెండు పార్టీలూ ఇప్పుడు సిఎం జగన్‌పైనే ఎక్కుపెట్టాయి. వైసిపిని కూల్చడమే ఈ రెండు పార్టీలకు ఎజండాగా ఉంది. ఒక వైపు చంద్రబాబు సభలు.. లోకేష్ పాదయాత్ర.. మరో వైపు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వారాహి యాత్రలు జోరుగా సాగుతున్నాయి. ఈ రెండు పార్టీల నడుమ పొత్తు దాదాపుగా ఖరారైనట్లేనంటున్నారు. రెండు పార్టీల మధ్య అవగాహన ఉంది. పొత్తు పెట్టుకుంటే జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానం జనసేనకు కేటాయించక తప్పదనే చర్చ జిల్లా నేతల్లోనూ ఉంది. పార్లమెంటు పరిధిలో ఒక స్థానం లేదా జిల్లాకు ఒక స్థానం తప్పదని తెలుగుదేశం ▶ 2లో

మీకు చేతనైతే..
ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి..

- జగన్‌తో సహా నాయకులందరూ ఇసుకను సంపద వనరుగా మార్చుకున్నారు
- గృహ నిర్బంధంతో పోలీసుల తీరుపై ఎమ్మెల్యే స్వామి మండిపాటు

మొయిన్ 3లో ▶



పామూరులో సిపిఎం సమరభేరిలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం సమరభేరి ప్రారంభం

5లో ▶

మూడేళ్లుగా పునాది దశలోనే...

నత్తనడకన మల్టీస్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గిరిజన గూడేల్లోని ప్రజలు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మల్టీ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. వైద్యశాల భవన నిర్మాణం ప్రారంభించి మూడేళ్లు దాటినా ఇప్పటికీ పునాది దశ దాటలేదు. 2023 నవంబర్ చివరి నాటికి భవన నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు పడటం లేదు. ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో 171 చెంచు గిరిజన గూడేల్లో 30 వేల మందికి పైగా చెంచు గిరిజనులు నివసిస్తున్నారు. పోషకాహార లోపం తదితర కారణాలతో వారు తీవ్ర అనారోగ్య పాలవుతున్నారు. వారికి నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన మల్టీ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

అందులో భాగంగా దోర్నాల మండలం అయినముక్కలలో 2020 అక్టోబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 8.28 ఎకరాల్లో రూ.49.26 కోట్లతో నిర్మాణం చేపట్టారు. నాబార్డు నుంచి రూ.38.62 కోట్లు కేటాయించారు. వాస్తవంగా భవన నిర్మాణం 2021 మే 28 నాటికి పూర్తి కావాల్సి ఉంది. నిర్దేశిత సమయంలో పూర్తి కాకపోవడంతో మరో 30 నెలల గడువు పెంచారు. దాని ప్రకారం ఈ ఏడాది నవంబర్ 27 నాటికి పూర్తి కావాల్సి ఉంది.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్యశాల నిర్మాణం పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు



పునాది నిర్మాణంలోనే ఉన్న దృశ్యం

వైద్యశాల అందుబాటులోకి వస్తే...

వైద్యశాల నిర్మాణం పూర్తయితే చెంచు గిరిజనులతో పాటు స్థానిక పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది. వైద్యశాలలో 150 పడకలు అందుబాటులోకి రానున్నాయి. డయాలసిస్‌కు 20, జనరల్ ఐపి 40, చిన్నారులకు 21, ఎస్ఐసియు 10, ఆర్థో 30, ఎంఐసియు 10 పడకలు ఉంటాయి. అన్ని విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉంటారు.

పొత్తులు కుదిరినట్లేనా.?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నేతలకు సంకేతాలు ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మూడు ముక్కలైంది. ఉన్న ఎనిమిది నియోజకవర్గాల్లోనే ఒక స్థానం జనసేనకు ఇవ్వక తప్పదంటున్నారు. ఇదే అవగాహనతో జిల్లా తెలుగుదేశం నాయకత్వం కూడా ఉంది. అయితే జనసేనకు ఏ స్థానం కేటాయిస్తారనే దానిపైనే ఇప్పుడు ఉత్కంఠగా ఉంది. ప్రస్తుతం జనసేన పార్టీ నేతల దృష్టి గిద్దలూరుపైనే ఉంది. నిజంగానే కేటాయించారా? ఎవరు పోటీ చేస్తున్నారు? అభ్యర్థి ఎవరు? అనే అంశాలను పక్కనబెడితే గతంలో ఇక్కడ ప్రజారాజ్యం నుంచి గెలిచిన నేపథ్యంలో జనసేన దృష్టి ఈ సారి కూడా అక్కడే ఉందనే చర్చ సాగుతోంది. ఇక్కడ జనసేనకు అనుకూలమైన సామాజికవర్గం ఓట్లు భారీగా ఉన్నాయి. ఇక్కడే అత్యధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనసేన ఇక్కడే ఆశిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఇక్కడ తెలుగుదేశం నుంచి బలమైన నేత మాజీ ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఆయన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే వ్యూహంలో ఉన్నారు. ఇక దర్శిలోనూ తెలుగుదేశం పార్టీకి ఇన్‌ఛార్జి లేరు. ఇక్కడ జనసేనకు కేటాయిస్తారనే చర్చ కూడా లేకపోలేదు. అభ్యర్థి ఎవరన్నదీ స్పష్టత లేదు. జనసేన నుంచి ఇక్కడ సీటు ఆశించే నేతలు కూడా బలంగా ఎవరూ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఇన్‌ఛార్జిని నియమించాలనే ఆలోచనలో తెలుగుదేశం జాతీయ కార్యదర్శి లోకేష్ పాదయాత్రలో ప్రకటించారు. ఇక్కడ టిక్కెట్ కోసం హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ ప్రయత్నాల్లో ఉన్నారు. లోకేష్ పాదయాత్రలోనూ ఆయన చురుగ్గా పాల్గొన్నారు. దర్శి నియోజకవర్గంలో సహకారం అందించారు. ఈయనతో పాటు గతంలో వైసిపి నుంచి టిక్కెట్ ఆశించిన బాదం మాధవరెడ్డి కూడా రంగంలో ఉన్నారు. వీరిద్దరి పేర్లు పార్టీ అధిష్టానం వద్ద చర్చలో ఉన్నాయి. ఇక పొత్తులు, కేటాయింపులపై రెండు పార్టీలు ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. అధికారికంగా పొత్తులపై ప్రకటన కూడా రాలేదు. ఏదేమైనా జిల్లాలో జనసేనకు ఒక స్థానం కేటాయించక తప్పదనే సంకేతాలు మాత్రం స్పష్టంగా జిల్లా తెలుగుదేశం నేతలకు అందాయి.

అడుగుకో స్పీడ్ బ్రేకర్..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని కాలేజి రోడ్డులో ఆర్‌టిసి డిపో సమీపంలో ఇటీవల నాలుగు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అవసరం ఉన్నచోట స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తే ఎవరికీ ఇబ్బంది లేదు. అయితే అవసరం లేని ప్రాంతంలో నిర్మించారు. వీటిని ఎవరి కోసం నిర్మించారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆర్‌అండ్‌బికి చెందిన ప్రధాన రహదారిలో అర్థ పర్లాంగు దూరంలో నాలుగు స్పీడ్ బ్రేకర్లు ఆనకట్టల్లా నిర్మించారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణీకులు విసుగెత్తిపోతున్నారు.ఆర్‌అండ్‌బి అధికారులు అనవసరమైన చోట ఆనకట్టల్లా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల గురించి ఎందుకు పట్టించుకోడం లేదో అర్థం కావడం లేదు.



అనుమతి లేకుండా నిర్మించిన స్పీడ్ బ్రేకర్



రాఖీలు కడుతున్న చిన్నారులు

వివేకానంద పాఠశాలలో రాఖీ వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామ పంచాయతీలోని వివేకానంద హైస్కూల్లో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.మాల్యాద్రి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులుకి రాఖీ పండుగ గురించి వివరించి, రాఖీలు కట్టించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భారీ అన్నదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని గాడిపర్తివారిపాలెంలో పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు తరలివచ్చి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్థంబ కార్యక్రమాలను తిలకించారు. విశేష పూజల్లో పాల్గొన్నారు. శిఖరకలశము, గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. జాష్టిసుబ్బారావులక్ష్మమ్మ దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ప్రదర్శించారు. మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారంవెంకారెడ్డి, దేవినేని హనుమంతరావు, గవిని బాలకోటేశ్వరరావు, నారిపెద్ది వెంకటరావు, వెంకటనారాయణ, బెల్లంకొండ రామచంద్రరావు, సుదిదల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

మహాశక్తితో మహిళాభివృద్ధి

ప్రజాశక్తి-కొండపి

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన మ్యానుపెస్టోతో రాష్ట్రంలో ఉండే మహిళలు అభివృద్ధి చెందడంతో పాటు తన కుటుంబాన్ని ఆర్థికంగా వృద్ధి చేసుకోగలగుతారని టిడిపి కొండపి నియోజకవర్గ పరిశీలకులు స్వాములు, మండల మహిళా అధ్యక్షులు బొద్దులూరి ప్రసన్న లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెదకండ్లగుంట పంచాయితీ పరిధిలోని జాళ్లపాలెం గ్రామంలో చేపట్టిన మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి మ్యానిపెస్టో కరపత్రాలను మహిళలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టనను మ్యానిపెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా ఉపాధ్యక్షురాలు మంగమ్మ, పెదకండ్లగుంట పంచాయతీ పరిదిలోని గ్రామ మహిళలు, మండల పార్టీ అధ్యక్షులు బి యలమందనాయకుడు, బత్తుల నారాయణస్వామి, వీరబోగవసంతరావు, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, గుండపేని రామూర్తి నాయుడు, దామా మురళి, గ్రామ నాయకులు, మండలంలోని టిడిపి నాయకులు, మహిళలు బారీగా పాల్గొన్నారు.

యుటిఎఫ్ నేతలకు నోటీసులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

వైనాట్ ఒపిఎస్, సిపిఎస్ రద్దు చేయాలని, జిపిఎస్ ఉపసంహరించు కోవాలని, పాత పెన్షను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ ధర్నాలో పాల్గొనరాదని సూచిస్తూ యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హైకు పోలీసులు గురువారం నోటీసు అందజేశారు. అబ్దుల్‌హై తోపాటు పి.శ్రీనివాసులురెడ్డి, బి.కపారావుకు పోలీసులు నోటీసులు అందజేశారు. ముందస్తు నోటీసులు అందజేయడాన్ని అబ్దుల్‌హై ఖండించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి అనుగుణంగా పాత పెన్షను విధానాన్ని పునరుద్ధరించి ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.



నోటీసులు అందజేస్తున్న పోలీసులు

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. తాగునీటి అవసరాల కోసం రామతీర్థం జలాశయం నుంచి ఒంగోలులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు సాగర్ నీటిని విడుదల చేశారు. నీటి రాకను కమిషనర్ మంగమూరు వద్ద బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో 1950 ఎంఎల్ నీటి కెపాసిటీకి గాను 677 ఎంఎల్, రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో 3750 ఎంఎల్ నీటి కెపాసిటీకి గాను 1085 ఎంఎల్ తాగునీరు అందుబాటులో ఉందని తెలిపారు. మొత్తం రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులలో 5800 ఎంఎల్ నీటి సామర్థ్యానికి గాను 1763 ఎంఎల్ తాగునీరు నిల్వ ఉందన్నారు. రెండు జలాశయాలను పూర్తిగా నింపేందుకు రెండు రోజుల కిందట సాగర్ నీటిని విడుదల చేశారని తెలిపారు. ఈనీటితో జలాశయాలను పూర్తిగా నింపుతామని, నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అవంతరాలు రానివ్వమని చెప్పారు. సాగర్ నీరు సక్రమంగా ఒంగోలులోని జలాశయాలకు చేరేందుకు సాగర్ కాల్వల మీద గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు కమిషనర్ చెప్పారు.



సాగర్ కాలువలో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

గ్రీనరి ఏర్పాటు పని పరిశీలన....

నగరంలోని పేర్నమిట్ట రెడ్డిపాలెం సమీపంలో రోడ్డు డివైడర్ మధ్యలో ఎన్‌క్యాప్ నిధులతో చేపట్టిన గ్రీనరి పనులను కమిషనర్ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. గ్రీనరి ఏర్పాటు కోసం మట్టిని రోడ్డుపై వేయడాన్ని గమనించిన కమిషనర్ వెంటనే మట్టిని డివైడర్ల మధ్యలోకి వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రీనరి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

వెంగముక్కపాలెంలో మేయర్ పర్యటన....

నగర మేయర్ గంగాడ సుజాత 18వ డివిజన్ పరిధిలోని వెంగముక్కపాలెంలో బుధవారం పర్యటించారు. అక్కడ చేపట్టిన అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణ పనులను పరిశీలించారు. మేయర్ వెంట కార్పొరేషన్ డిఇఇ పద్మజ, వైసిపి నాయకుడు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారనిఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మార్కాపురం పట్టణానికి చెందిన పోలా నారాయణమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 1.35లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి స్థానిక తన క్యాంపు కార్యాలయంలో నారాయణమ్మకు రూ.1.35 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, 27వ వార్డు కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-తర్లుపాడు

ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు ప్రజలు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రామకష్టారావు, అసిస్టెంట్ మేనేజర్ హెప్సిబా, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-తర్లుపాడు

స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్ అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు అవసరమైన సామగ్రిని ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ చైర్మన్ చాంద్‌బాషా, ప్రాజెక్టుర్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సంఘీభావ యాత్ర

ప్రజాశక్తి-కొండపి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారంతో 200 రోజులు పూర్తి కానుంది. అందులో భాగంగా నేడు సంఘీభావయాత్ర నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు తెలిపారు. మండల పరిధిలోని వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద జరుగుమల్లిలోని ఉల్లేరమ్మ తల్లి ఆలయం వద్ద వరకూ సంఘీభావ యాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంఘీభావ యాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు సంఘీభావ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సర్పంచి చొరవతో తీరిన నీటి సమస్య

ప్రజాశక్తి -కనిగిరి

మండల పరిధిలోని ఏరువారిపల్లి వడ్డెర కాలనీలో నీటి సమస్య నెలకొంది. నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు సచివాలయ కన్వీనర్ జగన్‌కి విన్నవించుకున్నారు. ఈ విషయం గురించి గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య, వైస్ సర్పంచి బండారి శ్రీను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఎంపిపి దంతులూరు ప్రకాశంతో మాట్లాడి ఎంపిపి నిధుల్లో నుంచి బోరు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఎంపిపి బోరు వేయించారు. ఈ సందర్భంగా సచివాలయం కన్వీనర్ జగన్, సర్పంచి దమ్ము వెంకటయ్య, వైస్ సర్పంచి బండారి శ్రీను, వైసిపి నాయకులు బత్తుల శ్రీను, బత్తుల రవి, బత్తుల వెంకటరమణ ,బత్తుల కృష్ణయ్య, బత్తుల బాబు, బత్తుల కాశీరాం, కాలనీ వాసులు ఎమ్మెల్యే మధుసూదన్, ఎంపిపి ప్రకాశంకు కతజ్ఞతలు తెలియజేశారు.



బోరు నిర్మిస్తున్న దృశ్యం

ఈవిఎం గోదాముల పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక మామిడిపాలెంలోని ఈవిఎం గోదాములను ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. నెలవారీ తనిఖీలలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి షట్టర్లకు వేసిన తాళాలు, సీలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గోదాములకు కల్పిస్తున్న భద్రత, వాటికి సంబంధించిన రికార్డులను ఇన్‌ఛార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దామరాజు క్రాంతికుమార్, బిజెపి నాయకులు గుర్రం సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె.రసూల్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఈవిఎం గోదాములను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో.. నలుగురికి గాయాలు

బాపట్ల : బొలెరో వాహనం, బైకు ఢీకొన్న ఘటనలో భార్యాభర్త, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఘటన బాపట్లలోని జగనన్న కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. బాపట్ల ఏరియా వైద్యశాల అవుట్ పోస్ట్ ఎస్ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం... ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దినేష్ పానీపూరి వ్యాపారం చేసుకుంటూ బాపట్ల మండలం హైదర్ పేట నివాసం ఉంటున్నాడు. రాఖీ పండుగ కావడంతో భార్య శివాని, మూడేళ్ల కుమార్తె దుర్గ, ఏడాది కుమార్తె గీతతో కలిసి బైకుపై సూర్యలంక బీచ్‌కి వెళ్లారు. తిరిగి ఇంటి వస్తుండగా టీచర్స్ కాలనీ వైపు నుంచి హైవే ఎక్కుతున్న బొలెరో వాహనం, బైకు ఢీకొన్నాయి. దీంతో బైకుపై ప్రయాణిస్తున్న నలుగురికి గాయాల య్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

బాలుడిపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

పెద్దదోర్నాల : బాలుడిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మార్కాపురం డిఎస్‌పి వీరరాఘవరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... మండల పరిధిలోని కాటకానిపల్లి గ్రామానికి చెందిన ఆరవ తరగతి విద్యార్థి సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గ్రామంలో నిర్వహిస్తున్న వివాహ వేడుకల వద్ద ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన ముండ్ల శ్రీను అనే వ్యక్తి బాలుడిని బైకు ఎక్కించుకొని ఊరికి దూరంగా కొండప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం బాలుడిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలుడిని అక్కడే వదిలి పెట్టి వెళ్లిపోయాడు. రాత్రి 10 గంటల సమయంలో బాలుడు ఇంటికి చేరుకొని జరిగిన విషయం గురించి తమ అమ్మమ్మకి చెప్పాడు. ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మారుతీ కృష్ణ , ఎస్ఐ అంకమ్మరావు పాల్గొన్నారు.

క్రైమ్ కాలమ్

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

త్రిపురాంతకం : బైకు అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సోమేపల్లి అడ్డరోడ్డు వద్ద గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి పై బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన తుమాటి కోటయ్య (30) బైకుపై త్రిపురాంతకం నుంచి తన స్వగ్రామమైన వెల్లంపల్లికి వెళ్తున్నాడు. సోమేపల్లి అడ్డరోడ్డు వద్దకు వచ్చే సరికి బైకు అదుపు తప్పి బోల్తా కొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ సుమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

మార్కాపురం రూరల్ : విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని భూపతి పల్లె ఎస్‌సికాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. భూపతిపల్లె ఎస్‌సి కాలనీకి చెందిన వేశపోగు రాజకుమార్(23) మార్కాపురం పట్టణంలో పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే పనులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. అనంతరం స్నానం చేసి టవల్ బయట ఆరేస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ గురయ్యాడు. గాయపడిన రాజకుమార్‌ను బంధువులు వైద్యశాల తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం భార్యకు గాయాలు

వేమూరు : రోడ్డు ప్రక్కన ఆగిఉన్న ట్రాక్టర్‌ను టివిఎస్ వాహనం ఢీకొన్న ఘటనలో భర్త మృతిదుర్మరణం చెందాడు. భార్యకు గాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చంపాడు అడ్డరోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కొలకలూరు గ్రామానికి చెందిన నాగరాజు (32) అనే యువకుడు కొలకలూరు నుంచి కొల్లూరుకు టివిఎస్ వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి నాయకులకు నోటీసులు

కొండెపి : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు పిలుపులో భాగంగా ఇసుక సత్యాగ్రహం కార్యక్రమంలో విజయవాడలోని మైనింగ్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాలో పాల్గొనవద్దని సూచిస్తూ మండల పరిధిలోని టిడిపి నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు బుధవారం జారీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి యూత్ మండల అధ్యక్షుడుకాలేషా మాట్లా డుతూ ఇసుక అక్రమ రవాణా, మైనింగ్ మాఫియాకు పాల్పడుతున్న వైసిపి నాయకులకు పోలీసులు కొమ్ముగాస్తున్నారని విమర్శించారు.

ఉద్యానవన పంటలు పరిశీలన

పెద్ద దోర్నాల : మండల పరిధిలోని చింతల చెంచుగూడెంను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ రవీంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ, ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన ఉద్యానవన పంటల పనులను పరిశీలించారు. అనంతరం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన పంటలు సాగు చేయడం ద్వారా చెంచుల సుస్థిరమైన ఆస్తులు, ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందన్నారు. ఉద్యాన పంటల సాగు ద్వారా చెంచు కుటుంబాలకు 150 రోజుల పని దినాలు, అంతర్గత పంటల కోసం మూడు సంవత్సరాల పాటు సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సాంకేతిక సహాయకులు షేక్ లాలఅహ్మద్, జూనియర్ సాంకేతిక సహాయకులు వెంకటేశ్వర్లు, సర్పంచి బి.వెంకటయ్య, మాజీ ఎంపిటిసి పోతన్న పాల్గొన్నారు

రుణ మేళాపై అవగాహన

టంగుటూరు : పాడి రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసు కోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె. బేబీరాణి సూచించారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో పాడి రైతులకు రుణ మేళా పై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ పశు పోషకుల జీవనోపాధి అయిన గేదెలకు గడ్డి, దాణాతో పాటు బలవర్ధకమైన ఆహారం, పశువుల కోసం అయ్యే ఇతర ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ప్రతి పాడి రైతుకు రూ.50 వేల వరకు రుణ సౌకర్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు రుణ సౌకర్యానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సుమారు 83 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి అర్హుల జాబితాను బ్యాంకులకు పంపి రుణం మంజూరు చేయించాలని బేబీరాణి స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వల్లూరు పద్మ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి రాజశేఖర్, పశు సంవర్ధక శాఖ టంగుటూరు సహాయ సంచాలకులు డాక్టర్ కసుకుర్తి సుధీర్ బాబు, సూరారెడ్డిపాలెం వైద్యాధికారి డాక్టర్ జి. విజయమాధవి, ఎంపిటిసి యల్లసిరి సత్యవాణి, కుందం హనుమారెడ్డి, పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలను ప్రతిఘటించేందు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి జాతాను బుధవారం ప్రారంభం ప్రారంభించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ ప్రజల హక్కులు కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు ప్రజలకు షాక్ కొడుతున్నాయని ఆరోపించారు. కష్టపడిన చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు రాక ఉపాధి లేక నేటికీ తల్లిదండ్రులపై ఆధారపడి జీవి స్తున్నారన్నారు. రైతులు వ్యవసాయంను మర్చిపోయారన్నారు. చదువు కున్న వారికి రిజర్వేషన్లు ప్రాధాన్యత లేకుండా చేసిన నరేంద్ర మోడీకి ఘోరీ కట్టేరోజులు దగ్గర పడ్డాయని విమర్శి ంచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా వచ్చే నెల 4న తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో మండల పురిధిలోని రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె. మాల్యాద్రి, సయ్యద్ గౌస్‌బాషా, కాలే శంకర్, అలాభక్షు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం మండల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు విమర్శించారు. సమరభేరి జాతాలో భాగంగా హనుమంతుని పాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధిక ధరలను అరికట్టా లన్నారు. రకరకాల పేరుతో వేస్తున్న విద్యుత్ భారాలను ఉపసంహరించు కోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురునాథం, రాములు, పోతురాజు, మంగయ్య, కత్తి ఏబు తదితరులు పాల్గొన్నారు. **కనిగిరి :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అను సరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి.కేశవరావు కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కనిగిరి మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో సిపిఎం నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యవసర ధరలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం అల్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మోడీ భజన చేస్తున్నారని



కనిగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

విమర్శించారు. కార్మిక, ఉద్యోగ, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు నిర్వహిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాసులు ,పి. నరేంద్ర, ఆర్.ఏడుకొండలు, శాంత కుమారి, యు.పిచ్చయ్య, రమణమ్మ, వెంకటమ్మ, రమ, హజరత్ పాల్గొన్నారు. **వెలిగండ్ల :** నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకూ నిర్వహిస్తున్న సమరభేరి జాతాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. సమరభేరి జాతాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు రాయల మాలకొండయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను, ధరలను అదుపు చేయటంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తుందన్నారు. సమరభేరి జాతాలో భాగంగా ఆరు రోజుల వివిధ రూపాల్లో నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ప్రజలందరకూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. **సిఎస్‌పురంరూరల్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు కోరారు. నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకూ సమర భేరి జాతాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతా సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సిఎస్ పురం, నల్లమడుగుల, అరివేముల, ఉప్పలపాడు గ్రామాలలో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లా డుతూ ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామంటూ చెప్పిన మోడీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను ఊడ గొడుతు న్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమర భేరి జాతాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్.తిరుపతిరెడ్డి, అజీజ్ బాషా, ఏసుదాసు, రత్నం, రత్నారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. **కొండెపి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఘటించాలని సిపిఎం మండల కార్యదర్శి కెజె.మస్తాన్ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఘటించాలని కోరుతూ ఈనెల 30 నుంచి వచ్చేనెల 4 వరకూ నిర్వహిస్తున్న సమరభేరి జాతాను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా కెజె.మస్తాన్ మాట్లాడుతూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా సమరభేరి జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, అంగలకుర్తి బ్రహ్మయ్య, గడ్డం వందనం, గడ్డం పిచ్చయ్య, లక్కిపోగు సుధాకర్, ఆదాం గోపి, అంకన్న ,పరిశుద్ధం, అంగలకుర్తి ఆశీర్వాదం, మంగళగిరి అంజమ్మ పాల్గొన్నారు. **చీమకుర్తి :** విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు డిమాండ్ చేశారు. సిపిఎం సమరభేరి జాతా మండల పరిధిలోని పాటిమీద పాలెం, నాయుడుపాలెం,కె.అగ్రహారం, మంచికల పాడు, బండ్లమూడి, తొర్రగుడిపాడు, పల్లామల్లి, నేకునాంబాద, పులివారిపాలెం, చండ్రపాడు, ఎర్రగుడిపాడు గ్రామాలలో బుధవారం పర్య టించింది. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ తాను అధికారం లోకి రాగానే ధరలు తగ్గిస్తానని, విద్యుత్ ఛార్జీలు పెంచమని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ తుంగలో తొక్కి రకరాల పేర్లతో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు .కేంద్రం చెప్పిందానికి తల ఊపుతున్న వైసిపి ప్రభుత్వం విద్యుత్ చట్టం 2020కి ఆమోదం తెలిపిందన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీలు, సర్ చార్జీలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.చినపరెడ్డి, తొట్టెంపూడి రామారావు, పొత్తూరి సురేష్, కుమ్మిత శ్రీనివాసులరెడ్డి, జి.చెన్నకేశవులు, టి.ఏసురత్నం, పమిడి సుబ్బారావు,ఎం.ఆంజనేయులు, కన్నా వెంకటరావు, శంకర్, కళాకారులు కోటేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

టిటిడి పాలక మండలి సభ్యుడిగా 'శిద్దా' ప్రమాణం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిటిడి ధర్మకర్తల పాలకమండలి సభ్యుడిగా శిద్దా వీర వెంకట సుధీర్ కుమార్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయం లోని గరుడాళ్వార్ సన్నిధిలో టిటిడి అధికారులు శిద్దా సుధీర్ కుమార్ చేత ప్రమాణం చేయించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా వచ్చిన శిద్దా సుధీర్ కుమార్‌కు మహాద్వారం వద్ద టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శిద్దా సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. రంగ నాయకుల మండపంలో వేద పండి తులు వేదాశీర్వచనం అందించారు. టిడిపి ఇఒ శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్ర మంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన సతీమణి లక్ష్మి పద్మావతి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో శిద్దా సుధీర్ కుమార్



టిడిపి పాలక మండలి సభ్యులతో శిద్దా సుధీర్ కుమార్, వారి కుటుంబ సభ్యులు

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి -దొనకొండ

అధిక ధరలు, అధిక విద్యుత్ ఛార్జీలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రజల సమస్యలను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతి ఘటించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు కోరారు. సిపిఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ చెట్టు ఎక్కిన ధరలను చేతిలోకి తెస్తానని, ఏడాదికి రెండుకోట్లు ఉద్యోగాలు ఇస్తానని, 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చెప్పిన మాటలు నీటి మూటలు అయ్యాయని ఎద్దేవ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు తాండవ రంగారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై బుధవారం నుంచి సమరభేరి జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతాలో భాగంగా ఈనెల 31న అధిక ధరలు అరికట్టాలని, మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని కరపత్రాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 1,2 తేదీల్లో సమస్యలపై అర్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 3న నిరుద్యోగ సమస్యపై నిరసన, 4 న ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందుర్తి అనీల్, కిరణ్‌కుమార్,కొండా ప్రాన్సీస్, వీరరాఘవులు, ప్రభాకర్, కర్ణా కృష్ణ, దాసు పాల్గొన్నారు.

దోర్నాలను కరువు మండలంగా ప్రకటించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్దదోర్నాలను కరువు మండలంగా ప్రకటిం చాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలలుగా వర్షాలు లేకపోవటంతో బోర్ల కింద ముందస్తుగా సాగు చేసిన మీరప, కంది, పత్తి పంటలు ఎండి పోతున్నట్లు తెలిపారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కొంత మంది రైతులు భూములను దున్ని పైర్లు సాగు చేసేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని చిన్న దోర్నాల, రామ చంద్రకోట, చింతల, ఆగ్రహారం, చిన్న గుడిపాడు, బొమ్మలాపురం గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి బోర్ల నుంచి నీరు కూడా రావడం లేదన్నారు. దీంతో ప్రజలు తాగడానికి కూడా నీరు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు.విద్యుత్ కోతలు, లోఓల్టేజీతో ప్రజలు అల్లాడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దదోర్నాలను కరువు మండలంగా ప్రకటించాలన్నారు. వర్షాభావం కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకుడు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

యర్రగొండపాలెం : దస్తాలేఖర్ల ప్రమేయం లేకుండా కక్షిదారులే నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాల యానికి వెళ్లి దస్తావేజు రాసుకునే ప్రక్రియ ప్రైమ్ 2.0 నూతన విధానాన్ని రిజిస్ట్రేషన్ శాఖ తీసుకొచ్చింది. దీంతో దస్తావేజులు రాసుకునే కొన్ని లక్షల మంది లేఖరులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంప్ వెండర్ల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంది. ఈ నూతన విధానాన్ని నిరసిస్తూ దస్తావేజు లేఖర్ల బుధవారం పెన్‌డౌన్ సమ్మె చేపట్టారు. విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు యక్కలి బాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన విధానాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అప్రైమ్ 2.0 విధానం వల్ల అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు తాళ్లపల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఊట్ల సుబ్బారావు, కుర్రా మల్లిమర్జునరావు, ప్రసాద్, కొప్పర్తి కొండారెడ్డి, రెహమాన్, నాగరాజు, రామచంద్ర మూర్తి, స్టాంప్ వెండర్ దొంతా బాబూరావు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు ప్రతాప్

సమరభేరి గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - వేటపాలెం, చిన్నగంజాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సమరభేరి గోడపత్రికను చిన్నగంజాం అంబేద్కర్ సెంటర్ నందు సిపిఎం నాయకులు జీ ప్రతాప్ కుమార్ గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న సచివాలయాల్లో అర్జీలు, 4న ధర్నా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జివి రాంప్రసాదరెడ్డి, డి రాఘవులు, జి పుల్లారావు, అనిల్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ధరలను తగ్గిస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ హామీలు నిలబెట్టుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కె శరత్ డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాన్ బాషా, పోలేరమ్మ పాల్గొన్నారు.



కాశియ్య కార్నియా సేకరిస్తున్న శంకర్ నేత్రాలయ వైద్యులు

కాశియ్య నేత్రదానం

ప్రజాశక్తి - అద్దంకి

సామాజిక సేవా కార్యకర్త చల్లా కాశయ్య అనారోగ్యంతో మృతి చెందారు. శింగరకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల అంగీకారంతో కాశయ్య కార్నియాను పెద కాకాని నేత్రాలయ డాక్టర్ దీక్షా గుప్తా బృందం మంగళవారం రాత్రి 11గంటలకు వచ్చి సేకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చిన్ని మురళీ కృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, అద్దంకి లేవిప్రసాద్, రొటేరియన్స్ చుండూరి మురళీ సుధాకరరావు, షేక్ మహమ్మద్ రఫీ, సామజిక సేవా కార్యకర్తలు శేషారెడ్డి, జోతయ్య, శివ, ఆప్తమాలాజిస్ట్ జె ఉమా పాల్గొన్నారు.



పెన్‌డౌన్ నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖరులు

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్తగా ప్రవేశ పెట్టిన కార్డు ప్రైమ్ 2.0తో ప్రజలు, దస్తావేజు లేఖర్లు, డిటిపి ఆపరేటర్లు, స్టాంపు వెండర్లుకు నష్టం జరుగుతుందని దస్తావేజు లేఖర్లు పేర్కొన్నారు. దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు బుధవారం సమ్మకు దిగారు. స్థానిక సబ్‌రిజిస్ట్రారు ఆఫీసు పరిధిలో కార్డు ప్రైమ్ 2.0కు నిరసనగా పెన్ డౌన్ చేసినట్లు దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు తానికొండ ఎలియాజరు తెలిపారు. సమ్మె నోటీసును అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అమ్మనమంచి శ్రీనివాసరావు, బండ్ల వెంకట సుబ్బారావు, షేక్ అబ్దులా, పోలూరి జగన్మోహనరావు, వంకాయలపాటి శ్రీనివాసరావు, బాచిన శ్రీనివాసరావు, చల్లా పూర్ణచంద్రశేఖర్, యనమండ్ర కృష్ణమోహన్, రావి మధుసూదనరావు, డిటిపి ఆపరేటర్లు కుర్రా అనంతలక్ష్మి, మద్దినేని నిర్మల, మండవ రాఘవ, జరుగుల పార్వతి, స్టాంపు వెండర్లు బాచిన శ్రీనివాసరావు, అమరా రామమోహనరావు, రావూరి రంగారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పురపాలకుల వైఫల్యం

- కుందేరు ఆధునీకరించాలి
- మురుగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలి
- పట్టణ పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి
- సిపిఎం నేతలు డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో ప్రజలు ఎదుర్కొనే మౌళిక సమస్యలు పరిష్కారం చేయడంలో పురపాలకులు విఫలమయ్యారని సిపిఎం పట్టణ కార్యదర్శి నలతోటి బాబురావు ఆరోపించారు. స్థానిక పేరాలలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికైన 33మంది వార్డు కౌన్సిలర్లు అందరూ ఒకే ప్రతిపక్షం కావడంతో ప్రజా సమస్యలపై కనీస ప్రస్తావన చేయడంలేదని అన్నారు. వాళ్ల ప్రయోజనాలు ఉన్న అంశాలను ఎలాంటి చర్చ లేకుండా ఆల్ పాస్ చేసుకుంటూ ప్రజల సమస్యలను కనీసం చర్చకు కూడా రానివ్వడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు రాబట్టడంలో పురపాలకులు విఫలమయ్యారని అన్నారు. ఎంతో కాలంగా పట్టణంలో డ్రైనేజీ సమస్య



విలేకర్ల సమావేశంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు

తీవ్రంగా ఉంది. రూ.వందల కోట్లు ఖర్చు చేసినప్పటికీ డ్రైనేజీ సమస్య పరిష్కారం కావడంలేదు. నీటిపారుదలకు వాలుగా ఉన్న వైపు కాకుండా ఎగువకు కాలువల నిర్మాణం చేసి శాశ్వత మురుగునీటి ఎత్తిపోతల పథకాలతో మున్సిపాలిటీకి నిర్వహణ భారంగా మారిందనేది గుర్తించాలని అన్నారు. రైలు పట్టాలకు పడమర వైపు ఉండే ప్రజలు వర్షకాలంలో నీళ్లపోక దోమలు చేసి అంటువ్యాధులు, విషజ్వరాలతో అవస్థలు పడే పరిస్థితి ఉందన్నారు. కుందేరు అభివృద్ధి చేసి నీటిపారుదల ఉండే విధంగా చేస్తే పట్టణ మురుగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తాము సూచిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో పారిశుద్యం పడకేసిందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచలేదన్నారు. ఇళ్లులేని పేదలకు స్థలం ఇవ్వడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలు సెంటు స్థలం ఇచ్చినప్పటికీ చీరాల పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో వైఫల్యం కనిపిస్తుందన్నారు. ఈ సమస్యలు పురపాలకు లకు సవాలుగా మారాయని అన్నారు. కుందేరుని ఆక్రమణ దారులనుండి కాపాడలేకపోతున్నారని అన్నారు. ఆక్రమణ దారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలకు పురపాలకులే సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. పట్టణ నడిబొడ్డులో పురపాలక స్థలం ఆక్రమించి కట్టడాలు కట్టినాకూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మున్సిపల్ నిధులతో అంబేద్కర్ కాంస్య విగ్రహ నిర్మాణంలో అంబేద్కర్‌వాదులను పరిగణలోకి తీసుకోకపోవడం ఏకపక్ష ధోరణికి నిదర్శనమని అన్నారు. సమస్యల పరిష్కారానికి నిధులు రాబట్టాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎం వసంతరావు, ఎల్ జయరాజు పాల్గొన్నారు.

మోపిదేవి సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి మద్దతుదారులు

ప్రజాశక్తి - నగరం

టిడిపికి చెందిన 10కుటుంబాలు రాజ్యసభ సభ్యులు, వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణారావు సమక్షంలో వైసిపిలో చేరారు. మండలంలోని తాడివాకవారిపాలెం పంచాయితీ దాసరిపాలెంలో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన టిడిపి సానుభూతిపరులైన నున్న కోటేశ్వరరావు, నున్న కనకారావు, నున్న బోశయ్య, కుండకర్ల శివన్నారాయణ మరికొందరు మోపిదేవి సమక్షంలో వైసిపిలో చేరారు. పెద్దమట్లపూడి పంచాయతిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.11.43కోట్లు లబ్దిదారులకు అందించినట్లు



గడప గడపకు కార్యక్రమంలో ఎంపి మోపిదేవి వెంకటరమణ

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ తెలిపారు. ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అననారు. ప్రజలు అడిగే సమస్యలనీ పరిష్కరించేదిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సింగపూర్ కంపెనీలు అంటూ మాయమాటలు చెబుతున్నారని అన్నారు. చంద్రబాబు సిఎంగా ఉండి కొడుకు లోకేష్‌ను మంగళగిరిలో గెలిపించుకోలేక పోయారని అన్నారు. ఇన్నాళ్లు కుప్పంలో 30నుంచి 40వేలు దొంగ ఓట్లుతొ గెలుస్తున్నారని, ఇపుడు అక్కడ వైసీపీ వాళ్ళు దొంగ ఓట్లు తొలిగిస్తున్నారని అన్నారు. ఎవరు, ఎన్ని కుట్రలు చేసిన మళ్లీ జగన్ సిఎం కావాలని ప్రజలు ఆశిస్తున్నట్లు చెప్పారు. మోపిదేవి వెంట ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, తాడివాక అనిల్ కుమార్, సర్పంచ్ లుక్కా బాపయ్య, జాఫర్, ఎంపిటిసి కరీమ్, మొగలిపువ్వు భాస్కరరావు ఉన్నారు.

కుక్కల భయంతో ఏల్చూరు ప్రజల ఆందోళన

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరులో వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలు అయ్యాయి. గ్రామంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో కుక్కలు దాడి చేసి పలువురినీ గాయపరు స్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాక్సిన్ కోసం 7కిలోమీటర్ల దూరంలోని సంతమాగులూరు పిహెచ్‌సికి వెళ్లవలసి వస్తుందని తెలిపారు. ఇప్పటికే చిన్నపిల్లలు, వృద్ధులు, పెద్దవారు అనే తేడా లేకుండా 20 మందినిపైగా గాయపరిచాయని చెబుతున్నారు. కుక్కల దెబ్బకు వీధిలోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయితీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో 12వేల మందికిపైగా జనాభా నివసిస్తున్నారు. 3గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఏడాది క్రితం ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది. ఇద్దరు డాక్టర్లను, సిబ్బందిని నియమించింది. అయితే అధికార పార్టీలోని నాయకుల ఆధిపత్య పోరులో ఆరోగ్య కేంద్రానికి స్థల సేకరణ జరగడంలేదు. ఏల్చూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మొత్తము సంతమాగులూరు పిహెచ్‌సిలోనే విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ఉన్నప్పటికీ వ్యాక్సిన్ భద్రపరిచే సౌకర్యం లేదు. దీంతో ఎలాంటి వైద్యానికైనా సంతమాగులూరు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని, వీధి కుక్కలను పట్టి దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా

వేతన స్థిరీకరణపై జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - బాపట్ల

నైపుణ్యం కలిగిన రోజువారీ వేతనాల స్థిరీకరణపై జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులతో జిల్లా కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విభాగాలు, ప్రైవేటు రంగ సంస్థలలో పనిచేస్తున్న సెమీ - స్కిల్డ్ అన్-స్కిల్డ్ వర్కర్ల దినసరి వేతనాల స్థిరీకరణపై అధికారులతో చర్చించారు. అత్యంత నైపుణ్యం గల వారికి రోజువారి వేతనం రూ.8వందలు, సాధారణ నైపుణ్యం గల వారికి రూ.760, పాక్షిక నైపుణ్యం గల వారికిరూ రూ.660, రూ.550రోజువారి వేతనం చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 2023-24 ఏడాదికి కార్మికుల రోజువారి వేతనాలను ఆమోదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన కమిటీ కన్వీనర్లుగా అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్, జాయింట్ డైరెక్టర్, మత్స్య శాఖ, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇమిగేషన్ (డిడబ్ల్యూ డివిజన్), సభ్యులుగా రేపల్లె మున్సిపల్ కమిషనర్, అద్దంకి మున్సిపల్ కమిషనర్ నియమితులయ్యారు.

ఎఐ కార్యాలయానికి దారిచూపుతారా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

దాతలు ఇచ్చిన స్థలంలో ప్రభుత్వం వెచ్చించిన నిధులతో వ్యవసాయ కార్యాలయం నిర్మించారు. అయితే కార్యాలయానికి వెళ్లే దారిలేక అధికారు లు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 10ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కార్యాలయానికి దారి లేకపోవడంతో వర్షాకాలంలో మోకాలి లోతు నీటిలో వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల విఎఎలు, ఆ గ్రామాల నుండి వివిధ పనులపై వచ్చే రైతులు కార్యాలయానికి రావడానికి వెనుకడుగు వేస్తున్నారు.



దారిలేని వేమూరు ఎఐ కార్యాలయం

గతంలో ఈ స్థలానికున్న రహదారిపై ఇరుగు పొరుగుతో వివాదం నెలకొనడంతో సమస్య పరిష్కరించడానికి ఉన్నతాధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని చొరవ చూపకపోవడంతో సమస్య అలాగే మిగిలిపోయింది. రైతులకు సేవలందిస్తున్న కార్యాలయాన్ని పట్టించు కోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో సొంత భవనం ఉంది. నియోజకవర్గ పరిధిలోని భట్టిప్రోలు, కొల్లూరు, అమర్త లూరు, చుండూరు మండలాల్లో కార్యా లయాలు అద్దె భవనాలలో కొనసాగు తునాయి. వేమూరులో సొంత భావన ఉన్నప్పటికీ ఎలాంటి వసతులు లేక పోవడంపై రైతుల పెదవీ విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి దారి ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు.



సభలో మాట్లాడుతున్న బాచిన క్రిష్ణచైతన్య

ప్రతి ఇంటికీ తాగునీరు

ప్రజాశక్తి - మేదరమెట్ల : జలజీవన్ పథకంలో భాగంగా మండలం లోని రావినూతలలో రూ.50.85లక్షల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటికి కులాయి పథకానికి అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి, కన్వీనర్ సాదినేని మస్తాన్రావు, సర్పంచ్ విజయ వాణీ, ఎంపీడీవో డి సురేష్ బాబు, రామినేని వెంకటరమణ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహాశీల్దారుకు వినతి చేస్తున్న టిడిపి నేతలు

ఓటర్ల మార్పుచేర్పులపై వినతి

ప్రజాశక్తి - సంతమాగులూరు : మండలంలోని అన్ని గ్రామాలలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల పూర్తి సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా ఇవ్వాలని కోరుతూ టిడిపి నాయకులు తేలప్రోలు రమేష్ తహసిల్దార్ టీ ప్రశాంతిని కలసి బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధూపాటి ఏసోబు, అయినాల శ్రీనివాసరావు, పసుపులేటి కోటేశ్వరరావు, కొనికి శ్రీనివాసరావు, గాడిపర్తి రాంబాబు పాల్గొన్నారు.



క్రీడా సామాగ్రి పంపిణీ చేస్తున్న ఎంపిపి

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం విడుదల చేసిన క్రీడా పరికరాలను స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ దేవరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ, జడ్పీటీసీల చేతుల మీదుగా ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బీవీ లలిత కుమారి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి ప్రతి పాఠశాలలో క్రీడలు అలవర్చుకోవాలనే ఉద్దేశంతో క్రీడా పరికరాలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి టి ఉదయభాస్కరి, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ ఉన్నారు.



ఒకరికొకరు రాఖీలు కడుతున్న విద్యార్థులు

రాఖీ పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా స్థానిక ఆదర్శ హైస్కూలులో రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు సోదర భావంతో మెలగాలని కోరారు. నవోదయ విద్యార్థులు ఒకరిచే ఒకరికి రాఖీలు కట్టించారు.

జర్నలిస్టులకు రెండో విడత 72 అక్రిడేషన్లు మంజూరు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో జర్నలిస్టులకు రెండో విడత 72 అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడేషన్ కమిటీ ఛైర్మన్ పి రంజిత్ బాషా చెప్పారు. బుధవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. జర్నలిస్టుల ప్రయాణ సౌకర్యం కోసం ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బస్ పాసులు మంజూరు చేయాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు రైల్వే పాస్‌లు ఇవ్వాలని రైల్వే అధికారులకు చెప్పారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు రెన్యూవల్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజు రాయితీ కల్పించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి రంజిత్‌బాషా

సమావేశంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ కన్వీనర్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె సుభాషిణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, గహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు రాఘవేంద్రరావు, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, బాషా పాల్గొన్నారు.

ఐక్యతతో గడప గడపకూ.. జయప్రదం చేయండి: మేరుగ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సెప్టెంబర్ 4నుండి జరిగే గడపగడపకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున కోరారు. స్థానిక మార్కెట్ యార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గడపగడపకు జరిగే కార్యక్రమాన్ని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా కార్యకర్తలు చూడాలని కోరారు. భట్టిప్రోలులో జరిగే కార్యక్రమానికి కార్యకర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా ఐక్యతతో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఈ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

వైసిపి నాయకులు కుందేటి రమేష్, కుక్కల భూషణరావు, మద్దుల గిరిధర్, వేల్పూరు నాగేశ్వరరావు, చిన్నారి ఉన్నారు.

వర్షాభావంతో సాగునీరు లేక ఎండుతున్న మిర్చి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొప్పరం, బండివారిపాలెం గ్రామాలలో మెట్ట భూముల్లో బావులు, విద్యుత్ మోటార్ల కింద మిర్చి సాగు చేసిన రైతులు సాగునీరు అందక వేసిన పైర్లు ఎండు ముఖం పట్టడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఒక ఎకరానికి రూ.ఒక లక్ష వరకు ఖర్చు చేసి మిర్చి సాగు చేశారు. అయితే వర్షాలు కురవకపోవడంతో బావుల్లో ఉన్న నీరు ఇంకిపోయాయి. విద్యుత్ మోటార్ల కింద సాగుచేసిన రైతులకు 9 గంటలు



నీళ్లులేక ఎండుముఖం పట్టిన మిర్చి పైరు

ఇవ్వాల్సిన త్రీ పేస్ కరెంటు రాకపోవడంతో పొలాలకు నీరు అందక సాగు చేసిన మిర్చి పైరు ఎండు ముఖం పట్టింది. కళ్ళముందే ఎండిపోతున్న మిర్చి పైరును ఎలా కాపాడుకోవాలంటూ రైతులు లబోదిబో అంటున్నారు. గత ఏడాది మిర్చి పంట సాగుదారులకు మంచి లాభాలు రావడంతో ఈ యాడాది ఖరీఫ్‌లో వర్షాలు రాకపోతాయా అన్న ఆశతో రైతులు మిర్చి సాగు చేశారు. మిర్చి పంటను బతికించుకోవడానికి వాటర్ ట్యాంకుతో నీరు అందించాలంటే ఎకరాకు రూ.40వేలకు పైగా అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. కనీసం విద్యుత్ మోటార్ల ద్వారానైనా 9గంటలు విద్యుత్తును ఇచ్చి తమ మిర్చి పంటను కాపాడాలని రైతులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

బోధనోపకరణాలతో విద్యాబోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని 50శాతం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు స్థానిక వైఆర్ ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. సమావేశానికి డిఇఓ పివిజె రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ టిఎల్ఎం ఉపయోగించి బోధన చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో పునాది బాగా ఉంటే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్నదని డిజిటల్ టెక్నాలజీ పయోగించి బోధన చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన ఖచ్చితంగా పాటించాని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఓ ఎంఇ సత్యనారాయణ, పి వెంకటనారాయణ, హెచ్ఎం ఇ రాజశేఖర్, రిసోర్స్ పర్సన్స్ జి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాగాణిని తలపిస్తున్న గుండ్లకమ్మ వంతెన

ప్రజాశక్తి - అద్దంకి

చిన్నపాటి చిరుజల్లులకు గుండ్లకమ్మ వంతెనపై మాగాణిని తలపిస్తుంది. వంతెనపై పాదచారులు, వాహన చోదకులు ప్రయాణించాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే బ్రిడ్జిపై నీరు నిలిచిపోతుంది. అద్దంకి ప్రాంతంలో ఇటుక బట్టీల యజమానులు ఇటుక తయారి కోసం ఉపయోగించే మట్టిని తిమ్మాయపాలెం ప్రాంతాల నుండి అద్దంకికి



మాగాణిని తలపిస్తున్న గుండ్లకమ్మ వంతెన

తరలిస్తుంటారు. ట్రాక్టర్లు, లారీలలో పరిమితికి మించి అధిక లోడుతో తిరగడంవల్ల వంతెనపై గుంతలు పడ్డాయి. అధికారు లు నిబంధనలు విధించినప్పటికీ మట్టి రవాణా వాహనదారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిం దని గ్రామస్తులు చెబుతున్నారు. అధిక లోడుతో వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురై కొందరు గాయాల పాలు కాగా మరికొందరు మృత్యువాత పడ్డారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. పరిమితికి మించిన లోడుతో మట్టితోలే వాహన దారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పిహెచ్‌డి అవార్డు అందుకుంటున్న ఉమాశంకర్

ఉమా శంకర్‌కు పిహెచ్‌డి డాక్టరేట్

ప్రజాశక్తి - నగరం : శబ్ద కాలుష్యంలో కూడా స్పష్టంగా మాట్లాడగలిగేందుకు వినియోగించు కోదగిన ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరుపై విశ్లేషణ అనే అంశముపై మండలంలోని ఈదుపల్లి గ్రామానికి చెందిన చింతల వెంకట ధనుంజయ ఉమా శంకర్ పరిశోధన వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధన పత్రానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్‌డి డాక్టరేట్ పట్టాను మంజూరు చేసింది. యూనివర్శిటీ 39, 40స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి రాజశేఖర్ చేతులమీదుగా పిహెచ్‌డి పట్టాను ఉమాశంకర్‌కు అందజేశారు. ఉమాశంకర్ తండ్రి చింతల వెంకట శేషసాయి ప్రసాద్ గతంలో జాతీయ అవార్డు అందుకున్నారు.



చల్లా కాశియ్యకు నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు

నిస్వార్థ సేవకుడు చల్లా కాశీయ్య

ప్రజాశక్తి - అద్దంకి : నిస్వార్ధంగా సేవలు అందిస్తూ ఎంతో మందికి ఆకలి తీర్చి అందరి ఆదరాభిమానాలు పొందిన కాశీయ్య మృతిచెందడం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు. కాశీయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనారిటీస్ ఐక్య వేదిక సభ్యులు మృత దేహాన్ని బుధవారం సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, కార్యదర్శి జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, ఉపాధ్యక్షులు అంకం నాగరాజు, ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరావు, బండారు చంటిబాబు, మంచు హనుమంతరావు, జి బాలచందర్, ఇస్తర్ల వెంకటసుబ్బారావు, రింకు, బుజ్జి కొమ్మాలపాటి పాల్గొన్నారు.

యువగళంకు సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు) : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులకు చేరుకున్న సందర్భంగా లోకేష్‌కు సంఘీభావంగా అమృతలూరు మండలం పెదపూడి గ్రామం నుండి అమర్తలూరు ఆంజనేయస్వామి గుడి వరకు సుమారు 3.5కిలోమీటర్ల మేర పాదయాత్ర జరుగుతుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. ఈనెల 31న గురువారం సాయంత్రం 4గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.



కెరీర్ ఓరియంటేషన్ శిక్షణలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కెరీర్ ఓరియంటేషన్ శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్ : స్థానిక డిసిఆర్ఎం ఫార్మశి కళాశాలలో రైజ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో కెరియర్ ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు సిహెచ్ కిరణ్ కుమార్ ఐటి రంగంలో ఫార్మశీ విద్యార్థులకున్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిలుకూరి శ్రీధర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వేణు పాల్గొన్నారు.







ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించే

ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలి

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య పిలుపునిచ్చారు. అధిక ధరలు. అధిక విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం భట్టిప్రోలులో కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ద్వారా నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్ ధరలు పెరిగిపోయి సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన సమరభేరీ కార్యక్రమంలో భాగంగా గురువారం వరకు కరపత్రాల పంపిణీ, సెప్టెంబర్ ఒకటో తేదీన అన్ని సచివాలయ కార్యాలయాల వద్ద ధర్నా మరియు విద్యుత్ బిల్లుల దగ్ధం, నాలుగో తేదీన అన్ని మండల తహాశీల్దార్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమాలకు కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, మండల నాయకులు ఎం సత్యనారాయణ, జి నాగరాజు, జి సుధాకర్, బట్టు నాగమల్లేశ్వరరావు, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.


కూరగాయల వ్యాపారికి కరపత్రం అందజేస్తున్న గంగయ్య

టిడిపి ఇన్‌ఛార్జి నరేంద్రవర్మ గృహనిర్బంధం

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మను బాపట్ల పట్టణ పోలీసులు బుధవారం గహనిర్బంధం చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఇసుక దోపిడీపై పోరాటం చేస్తున్న తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇసుక సత్యాగ్రహం కార్యక్రమంలో భాగంగా మైనింగ్ శాఖ డీడీని కలిసేందుకు విజయవాడ వెళ్లడానికి వీల్లేదంటూ నరేంద్రవర్మకు నోటీసు ఇచ్చి.. పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.


నరేంద్రవర్మకు నోటీసు ఇస్తున్న పోలీసులు



